నేను రోజూలాగే బద్ధకంగా వళ్లు విరుచుకుంటూ మంచం మీద నుండి నిద్ర లేచాను. కిటికీ లోంచి ఎండ మంచం మీద పడ్తోంది. అంటే టైమ్ ఏడున్నర అయిందన్నమాట. కిటికీలోంచి బయటకు చూస్తున్న వాడినల్లా ఒక్క క్షణం ఆగిపోయాను. ఎదురుగుండా ఎవరో అమ్మాయి తల చిక్కు తీసుకుంటోంది. "ఆ అమ్మాయి ఎవరబ్బా ?" అన్న అనుమానం వచ్చింది. ఎందుకంటే నిన్నటి వరకూ ఆ యిల్లు ఖాళీగానే ఉంది. "ఎవరో క్రొత్తగా అద్దెకు వచ్చి ఉంటారు" అని మనసులో అనుకుంటూ మొహం కడుక్కోవటానికి దొడ్లోకి నడిచాను. మొహం కడుక్కున్నాక వంటింట్లోకి వెళ్లి—

"అమ్మా తొందరగా కాఫీ ఇవ్వు" అడిగాను.

ఫ్లాస్క్‌లోని కాఫీని గ్లాసులోకి పోసి ఇచ్చింది మా అమ్మ.

"అమ్మా! ఎదురుగుండా ఇంట్లోకి ఎవరైనా క్రొత్తగా వచ్చారా ?"

"అవునురా ! ఎవరో ఒక అమ్మాయి వచ్చి దిగింది. ఆ అమ్మాయికి ఇక్కడ ఏదో స్కూల్లో క్రొత్తగా ఉద్యోగం వచ్చిందిట"

"టీచర్‌గానేనా ?"

"ఏమో టీచర్‌గానే అయ్యుండవచ్చు"

నేను మాట్లాడకుండా అక్కడి నుండి నా గదిలోకి వెళ్లి కిటికి దగ్గర నుంచున్నాను. కాఫీ తాగుతూ ఎదురింటి వైపుకే చూస్తూ నించున్నాను. ఇంతలో ఆ అమ్మాయి లోపలి నుండి ముందు గదిలోకి వచ్చింది. ఒకసారి రోడ్డువైపు అటూ ఇటూ చూసి లోపలికి వెళ్లబోతున్నదల్లా మళ్లీ వెనక్కి తిరిగింది. తిన్నగా ఆమె చూపులకు కిటికీ దగ్గర నుంచుని చూస్తున్న నేను చిక్కుకుపోయాను. ఆ అమ్మాయి అలాగే నన్ను చూస్తూ నించుంది. నేను ఆ అమ్మాయి కళ్లలోకి సూటిగా చూడలేకపోయాను. మెల్లిగా కిటికి ప్రక్కనుంచి తప్పుకుని వంటింట్లోకి వెళ్లిపోయాను.

* * *

రోజూకంటే ఆరోజు తొందరగానే ఆఫీసు నుండి ఇంటికి వచ్చాను. మంచం మీద కూర్చుని బూట్లు విప్పుకుంటూండగా మా ప్రక్కింటి అబ్బాయి వాసు రివ్వున పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చాడు.

"ఎందుకు వచ్చావురా ?" సాక్స్ విప్పుకుంటూ అడిగాను.

"మా టీచర్‌గారు ఏమన్నా పుస్తకాలు ఉంటే ఇమ్మన్నారు"

"ఎవర్రా మీ టీచర్ ?" కనుబొమ్మలు చిట్లిస్తూ అడిగాను.

"మరే ఎదురుగుండా ఇంట్లోకి కొత్తగా రాలే ఆవిడ !"

"ఓహో ! ఆవిడ మీకు టీచరా ?"

"అవును ఈ రోజే మాకు కొత్తగా వచ్చారు."

"మీ క్రొత్త టీచరుగారు నన్నే అడిగి పుస్తకాలు తీసుకు రమ్మందా ?"

"ఊ" అన్నాడు వాసు.

తర్పిగొయ్య ఎంత ధైర్యం! ఇవాళకాకనిన్న వచ్చింది. నేను ఎవరో ఆ అమ్మాయికి తెలియకుండానే, కనీసం మాట పరిచయం కూడా లేకుండానే పుస్తకాలు తెమ్మని పంపిస్తుందా! ఛన్ పుస్తకాలు లేవూ గిస్తకాలులేవు అని చెప్పమందామనుకున్నాను. కాని నా మనస్సు అందుకు ఒప్పుకోలేదు. "పాపం!ఆ అమ్మాయికి క్రొత్త ప్రదేశం కావటం వల్ల ఏం తోచటం లేదేమో ? పోనీ ఈ ఒక్కసారికి పుస్తకం ఇస్తే పోలే" అనిపించింది. చెయ్యి అనుకోకుండానే టేబుల్ మీద ఉన్న రెండు రోజుల క్రితం తెచ్చిన యువను తీసి ఇచ్చింది.



*68 సం॥గా దేశఖ్యాతిగాంచిన*

**నారసింహలేహ్యము**

సాలామిస్త్రీ, నపేదావిస్త్రీ, రజితము, కంకుమపువ్వు, మొ: అనేక వస్తువులు దాయము అన్ని విధములైన బలహీనత లను పోగొట్టి పుష్టి, పటుత్వము, మిక్కిలి బలము కలిగించుటలో అత్యుత్తమమైనది. 1 డబ్బా ఖరీదు రు. 6.75 పోస్టేజి లదనము.

**పి. శి. ఏ. అండ్ కో.,**

పెరిదేపి, ప్రకాశం జిల్లా.

పెద్ద క్యాటలాగు, వైద్య సలహా ఉచితము. ఏజన్సీలు ఇవ్వబడును.

# మా ఎదురింటి అమ్మాయి

వాసు పుస్తకం తీసుకుని పరుగెత్తు కొంటూ వెళ్లిపోయాడు.

* * *

మర్నాడు నేను ఆఫీసునుండి ఇంటికి వచ్చే టప్పటికి ఎనిమిదయింది. బట్టలు విడిచేసి లుంగీ షర్ట్ వేసుకుని మంచంమీద పడుకొని కాలక్షేపానికి ఇంట్లో ఉన్న పాత నవలను తీసి చదువుతున్నాను. "ఏమండీ!"ఎవరో బయట నుంచి పిలిచారు.

ఆ పిలిచిన పిలుపును బట్టి ఎవరో ఆడ వాళ్లే అయ్యుంటారని నేను మెల్లిగా మంచం దిగి కర్టెన్ తీసి చూశా. ఒక్కసారి నాగుండెలు దడదడ కొట్టుకోవటం మొదలెట్టాయి.

ఆ వచ్చింది ఎవరో కాదు మా ఇంటి ఎదురుగుండా ఇంట్లోకి క్రొత్తగా వచ్చిన అమ్మాయి.

"ఏం కావాలండీ"అని అనబోయి "ఎవరు కావాలండి"అని తొందర్లో అనేశాను.

"ఏం లేదండి! నిన్న మీరు పంపించిన యువ పుస్తకం ఇదిగో నండి"అంటూ చేతికి ఇచ్చింది.

"వాసు చేత పంపిస్తే పోయేది కదండీ" అన్నాను నేను.

"వాసు నిద్దర పోతున్నాడండి! లేకపోతే వాసుచేతే పంపిద్దును"అంది ఆ అమ్మాయి. నేను ఏమాట్లాడలేదు.

"ఇంకేవైనా పుస్తకాలుంటే ఇవ్వండి" అడిగింది.

అల్మారాలోకి ఒక పాత యువతీసి ఇచ్చాను. నేను పుస్తకం ఇచ్చేటపుడు ఆ అమ్మాయి కావాలనే నా చేతి వ్రేళ్లను తన చేతి వ్రేళ్లను తగిలించిందో, నా చేతి వ్రేళ్లే ఆ అమ్మాయి వ్రేళ్లకు తగిలాయో కాని నా కాళ్లలోమాత్రం వణుకు పుట్టింది.

ఆ అమ్మాయి వెళ్లాక కాని నా గుండె దడ దడా కొట్టుకోవడం తగ్గలేదు. "అసలు ఈ ఆడవాళ్లు ఏవరైనావస్తే నా గుండె ఎందుకొ ఇలా దడ దడ లాడుతుంది. ఈసారి ఏమైనాసరే ఆ అమ్మాయి వచ్చి నపుడు గుండె దడ దడ లాడకుండా ఓటువు చేసుకోవాలి" మనసులో అనుకున్నాను.

"ఒరే అబ్బాయి భోజనం వడ్డిస్తున్నారా! రా!" వంటింట్లోంచి పిలిచింది అమ్మ.

చేతిలోఉన్న పాత నవలను టేబుల్ మీద పడేసి వంటింట్లోకి వెళ్లాను.

* * *

ఆరోజు ఫస్ట్ తారీఖు నేను షర్ట్ తొడు క్కుంటూఉండగా "ఇదిగోరా పుస్తకం. ఆ అమ్మాయి నిన్న తీసుకువచ్చి ఇచ్చింది" అంటూ టేబుల్‌మీద పెట్టి లోపలకు వెళ్లి పోయింది మా అమ్మ.

అప్పటికి ఆ అమ్మాయి మా ఎదురు గుండా ఇంట్లోకివచ్చి నెల దాటింది. నేను పుస్తకం ఎవరికైనా ఇస్తే, మళ్లా వాళ్లు తిరిగి ఇచ్చాక లోపలపేజీలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవటం నాకు అలవాటు. ఆ ఉద్దేశ్యంతోనే నేను టేబులు మీద ఉన్న పుస్తకాన్ని లోపల పేజీలు సరిగ్గా ఉన్నాయో లేదోఅని చూస్తున్నాను. పుస్తకాన్నిచూస్తున్న నాకళ్లు ఒకపేజీ దగ్గర ఆగిపోయాయి. కారణం! ఆ పేజీలో ఎర్రటి కాగితం మడత

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి



"మేల్ మాయిల్ మందు"


నల్లరంగు, యెర్ర రంగు, పొడలు, దద్దులు, గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందున ఏర్పడు వినుగు పుట్టించు రణములు మొదలగు

దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి

— వివరములకు —

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P.O.) N.A. Dt.



పెట్టి ఉంది నేను కాగితాన్ని తీసి మడత విప్పి చూశా!

"డియర్ రమేశ్"

ఉత్తరంలోని ఆ సంబోధన చూశాక ఇది కొంపదీసి లవ్ లెటర్ కాదు కదా నాకు అనుమానం వచ్చింది.

తరువాత చదివాను.

మీరు అడిగినప్పుడల్లా నాకు పుస్తకాలను ఇస్తున్నందుకు నేను మీకు ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో నాకు తెలియటంలేదు. రమేష్ మీరు ఇస్తున్న పుస్తకాల్లోని కథల్లో హీరోల మాదిరిగా మీరు ఎంతో అందంగా వుంటారు. రమేశ్ నిజం చెప్పొద్దూ! నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. మీరు కూడా నన్ను ప్రేమిస్తున్నారనే నేను అనుకుంటున్నాను. నా యీ ప్రేమ ఉత్తరానికి వెంటనే జాబు రాస్తారని ఆశిస్తూ—

మీ ప్రేయసి.

క్రింద పేరు రాయలేదు.

నా గొంతులో తడారిపోయింది.

అది చలికాలం అయినా నేను వేన్నీళ్లలో అంత క్రితమే స్నానం చేసినా నా మొహం అంతా చెమట పట్టేసింది. భూమిగుండ్రంగా తిరుగుతున్నట్లు అనిపించింది.

"అమ్మా! మంచినీళ్లు" గట్టిగా అరిచాను.

గ్లాసు నీళ్లు తీసుకుని ఏమయ్యిందా అని మా అమ్మ పరుగెత్తుకుంటూవచ్చింది.

నేను గ్లాసు నీళ్లు అందుకొని గడగడా తాగేశాను. అప్పటికి నాలో కాస్త వణుకు తగ్గినట్లు అనిపించింది.

"ఏమిటిరా! ఏమయ్యింది" ఖంగారుగా అడిగింది మా అమ్మ.

"అబ్బే...ఏంలేదు. కాస్త కళ్లు తిరిగినట్లు అనిపించాయి" ఏం చెప్పాలో తెలియక అన్నాను.

"ఉండు కాఫీ పెట్టి యిస్తాను" అంటూ లోపలికి వెళ్లింది.

నేను మెల్లిగా వెళ్లి కుర్చీలో కూర్చున్నాను. నా కాళ్లలో ఇంకా వణుకు తగ్గలేదు

"ఔరా పోనీగదా అని పుస్తకాలు రెంట్ లేకుండా ఫ్రీగా సప్లై చేస్తూ ఉంటె నాకే ప్రేమ లేఖ వ్రాస్తుందా. ఇంకా కథల్లోమాదిరి హీరోల్లా నేను అందంగా ఉన్నానా! అంటే కథలో హీరో ముష్టి వెధవ అయితే నేనూ ముష్టి వెధవననే కదా అర్థం. అయినా ఆ అమ్మాయి ప్రేమలేఖ నాకు రాసిందంటే ఎంత ధైర్యవంతురాలనిచెప్పుకోవాలి! ఇన్నాళ్లు నేను లవ్ లెటర్స్ మొదట మొగాళ్లేఆడవాళ్లకు రాస్తారని అనుకున్నాను కాని ఆడ వాళ్లు కూడా మొగాళ్లకు రాస్తారని నా అనుభవ పూర్వకంగా ఇప్పుడే తెలుసుకున్నాను."

"నా జీవితంలో నేను ఎవరికీ లవ్ లెటర్ రాయలేదు కాని నేను మొదటి సారిగా లవ్ లెటర్ అందుకున్నది ఇదే. అయినా ఆ అమ్మాయికి నాపేరు ఎలా తెలిసినట్లు? ఈ వాసు వెధవే చెప్పి ఉండాలి. లేకపోతే ఎలా తెలుస్తుంది. ఛీ! ఆ అమ్మాయికి మాత్రం సిగ్గు ఉండక్కర్లే. ఏదో పుస్తకాలు ఇస్తున్నాను కదా అని ఆ చొరవతీసుకుని ప్రేమలేఖ రాస్తుందా! నాన్సెన్స్! ఐ డోంట్ లైక్ హర్"

"ఇదిగోరా కాఫీ" అన్న అమ్మ మాటకు ఆలోచనలోంచి బయట పడ్డాను.

## చిత్రం

ఆమె చూపుల్లో
తూపు లున్నాయి — ఆమె శకుంతల
అతని చేతిలో
చాపు ఉన్నది — అతడు దుష్యంతుడు
అతనీ చేతి చాపుల కంటె —
ఆమె చూపులు వాడి.
లక్ష్యానికి ప్రేమ నిండింది.
అతడు మృగాల్ని వేటాడాడు
ఆ మృగ నయని! అతన్ని వేటాడింది.
అతనికి దప్పిగా వుంది.
ఆమె నీటి కలువల్లా,
శరీరమంతా ధరించింది.
ఆ కుండలో నీరు ఒలికిపోతున్నది.
ఆమె కళ్ల నుంచి ప్రేమ తొణికిందిచూడు
అతడు దప్పి తీర్చుకోవటానికి
ఆమెను సమీపించి అడిగాడు
హే నీరజముఖీ! నా దప్పి తీర్చు.
ఆమె కళ్లతోనే జవాబిచ్చింది.

— కాణిపాకం లింగన్న.

కాఫీ తాగాక నాలో వణుకు, నాకు పట్టిన చెమటలు తగ్గినట్లు ఫీలయ్యాను.

షర్ట్ గుండీలు పెట్టుకుని, తల దువ్వుకొని ఆఫీసుకు బయలు దేరాను.

గేటు దాటబోతూ తలఎత్తి చూశాను. అంతే!

నాలో మళ్లీ వణుకు ప్రారంభమయ్యింది. ఎదురుగుండా ఆ అమ్మాయి తలుపుకు ఆనుకుని వయ్యారంగా నుంచుని నన్నే చూస్తోంది.

నేను తల వంచుకుని వేగంగా ముందుకు కదిలాను.

* * *

ఆ అమ్మాయి నాకు లవ్ లెటర్ రాసినా, నేను మామూలుగానే ఆ అమ్మాయి అడిగినప్పుడల్లా పుస్తకాలు పంపించినందుకు, మొదటి ప్రేమలేఖ పంపించిన పది రోజులకు "మీ దగ్గరనుండి జాబు రాలేదంటూ" మరో ఉత్తరం పంపించింది.

ఇంత జరిగినా నేను మాత్రం కాగితం మీద నా కలం పెట్టి ఆ అమ్మాయికి ఉత్తరం రాయలేదు అసలు ఎందుకు రాయాలి? రాయవలసిన అవసరం నాకులేదు. ఆ అమ్మాయికి సిగ్గులేకపోతే నాకు లేదేంటి?

కాని రెండోఉత్తరం నేను కాస్త ధైర్యంగా చదివేననేచెప్పాలి ఉత్తరంచివర ఆ అమ్మాయి "మీ ప్రేయసి 'గీత'" అని పేరు కూడా రాసింది. మొదటి ఉత్తరంలో రాయకపోయినా రెండో ఉత్తరంలో పేరు రాసినందుకు సంతోషించాను. నాకు ఆ అమ్మాయి రాసిన ప్రేమలేఖలు ఎక్కడ పొరపాటున బయటపడి నానా రభస అవుతుందోనని నేను వాటిని నా పెట్టెలో అట్టడుగున దాచేశాను. ఆ అమ్మాయి ధైర్యంగా నాకు ప్రేమ లేఖలు రాసిందంటే (నేను ఆ అమ్మాయికి రాయలేకపోయినా) నా మనసులో ఆ అమ్మాయిని నేను హర్షించలేకుండా ఉండలేక పోయాను.

* * *

ఆ రోజు ఆదివారం కదా అని తీరిగ్గా నేను తొమ్మిదింటికి లేచాను. మొహం కడుక్కుని స్నానం చేస్తూ ఉండగా—

"టెలిగ్రామ్ సార్" అరుపు వినిపించింది.

స్నానం చేస్తున్న వాడినల్లా వంటినున్న వదిలీ వదలని సబ్బు నురుగను కూడా గబగబా తుండుతో తుడిచేసుకుని ముందు గదిలోకి వచ్చాను. సంతకం పెట్టి టెలిగ్రామ్ అందుకున్నాను. అమ్మనాప్రక్కనే నుంచుని ఉంది

టెలిగ్రామ్ చింపుతున్నప్పుడు నా చేతులు కాస్త వణికాయి.

లోపల ఏంవార్త ఉందో అనే భయం!

తెరిచి చదివాక నాలో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

"అమ్మా! నువ్వు బామ్మవయ్యావు" గట్టిగా సంతోషం పట్టలేక అరిచాను.

"ఏమిటరా నువ్వనేది" కంగారుగా అడిగింది.

"నిజం అమ్మా! నువ్వు బామ్మవయ్యావు సరూకు మొగపిల్లాడు పుట్టాడు"

"నిజంగా" మా అమ్మ నమ్మలేనట్లు అడిగింది.



—మొదట్నుంచి చివరివరకు హీరోయిన్ని నగ్నంగా చూపెటేం... సెన్సారువాళ్ళు అంతా కట్‌చేసి పారేశారు చివరికి మనకి మిగిలిందేవిటోయ్ డైరెక్టరూ...

—బొట్టల ఖర్చు...

"నిజం అమ్మా!"

మా అమ్మను చూస్తూఉంటే నిజంగా ఆవిడకు ఇప్పుడు బామ్మకళ వచ్చింది అనిపించింది నాకు.

"అమ్మా! తొందరగా అన్నం వడ్డించేయ్. ఈరోజే సరూ దగ్గరకువెళ్ళాలి"

"ఇదిగో రెండు నిమిషాల్లో వడ్డించేస్తాను" అంటూ పరుగులాంటి నడకతో వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఒక్కసారి అంత సంతోషవార్త తెలిసే సరికి నాకేంచేయాలో ఏం చేస్తున్నానో తెలియటంలేదు.. ఇంతకీ పుట్టిన పిల్లాడు సరూ పోలికో నాపోలికో—

"అన్నం పెట్టానురా! రా!" అన్న పిలుపుకు గబ గబా వంటింట్లోకి వెళ్లి నాలుగు మెతుకులు తిన్నాననిపించుకుని, రెండు జతల బట్టలు ఎయిర్‌బాగ్‌లో కుక్కుకుని, వెళ్ళటానికి సిద్ధమయ్యాను.

నేను గడప దాటుతుండగా —

"మళ్లీ ఎప్పుడు వస్తావురా అబ్బాయి"

"ఇదిగో ఈరోజు బయలుదేరుతున్నానా! రేపులేదు ఎల్లుండి...ఎల్లుండిలేదు... ఇంకో నాలుగురోజులలో వస్తానమ్మా" అని చెప్పి గేటువరకూ వెళ్లాక మళ్లీ వెనక్కి తిరిగి వచ్చి "ఇదిగో ఈ విషయం ఎవరికి చెప్పకు. సరూ వచ్చేవరకూ ఈ విషయాన్ని కాస్త గుప్తంగా వుంచు సరూ వచ్చాక చుట్టు ప్రక్కల వాళ్ల నందరిని సస్పెన్స్‌లో ముంచెత్తాం"

# మా ఎదురింటి అమ్మాయి

"అలాగే" మా అమ్మ ముసి ముసిగా నవ్వుకుంటూ అంది.

నేను పరుగులాంటి నడకతో రైల్వే స్టేషన్‌కు బయలుదేరాను

* * *

ఆఫీసుకు టైమ్ అయిపోయిందని తొందర తొందరగా తయారవుతున్నాను. శ్రీమతి మంచం మీద కూర్చుని బాబును ఆడిస్తోంది.

తలుపు కొట్టిన చప్పుడు అయ్యింది.

నేను తలుపు తీశాను.

ఎదురుగుండా ఎదురింటిఅమ్మాయి గీత.

"ఓ...మీరా లోపలకి రండి ఆ కుర్చీలో కూర్చోండి"ఆహ్వానించాను.

కాని ఆ అమ్మాయి కూర్చోలేదు. అలా నుంచునే—

"ఆ...ఫర్వాలేదు. ఏమైనా పుస్తకాలు వుంటే ఇస్తారా" అడిగింది.

"తప్పకుండా" అంటూ శ్రీమతి వైపు తిరిగి—

"సరూ! నీకు సాయంత్రం పూట కాలక్షేపం కావటంలేదని ఇదివరకు అనే దానివి గుర్తుందా? ఇక పైన అటువంటి బాధఏమీ నీకు ఉండదు. ఈవిడ మనింటికి ఎదురుగుండా ఉన్న ఇంట్లోకి క్రొత్తగా వచ్చారు. స్కూల్లో టీచర్‌గా చేస్తున్నారు. పేరు గీత. ఈవిడ సాయంత్రంనుంచి రాగానే నీకుకావలసినంతకాలక్షేపం"అంటూ శ్రీమతికి పరిచయం చేశాను.

నేను మాట్లాడిన మాటలు ఆ అమ్మాయికి అర్థం కాలేదు కాబోలు! నన్నూ, శ్రీమతిని మార్చి, మార్చి చూస్తూ నించుండి పోయింది.

"ఓ...అన్నట్టు మీకు తెలియదు కదూ? ఈవిడ నా శ్రీమతి. పేరు సరోజ. ఈ మధ్య పురిటికని వాళ్ల పుట్టింటికి వెళ్లింది. మొన్ననే మా బాబు బారసాల జరిగింది. నిన్ననే నా శ్రీమతిని వాళ్ల ఊరినుండి తీసుకు వచ్చాను"అంటూ ఆ అమ్మాయి ముఖకవళికలు గమనించాను.

ఆ అమాయి మొహం అప్పటికే తెల్లగా పాలి పోయింది.

"అరెరెరే...మిమ్మల్ని నుంచో పెట్టే మాట్లాడేస్తున్నానా! మీరుపుస్తకం అడిగారు కదూ! ఇప్పుడే ఇస్తాను ఉండండి" అంటూ అల్మారా దగ్గరకు వెళ్లాను.

"ఇప్పుడు వద్దులెండి. సాయంత్రం వస్తాను. ఇప్పుడు స్కూలుకు టైమ్ అయ్యింది" అంటూ తల వంచుకుని గబగబా వెళ్లిపోయింది.

"పుస్తకం కావాలని వచ్చిన అమ్మాయి తీసుకోకుండానే వెళ్లిపోయిందే?" అడిగింది శ్రీమతి.

"స్కూలుకు టైమ్ అయ్యిందేమో"

"మీకు ఆఫీసుకు టైమ్‌కాలే"

"ఎందుకుకాలే. ఇప్పటికి చాలా లేటయింది" అంటూ బయలుదేరాను.

* * *

రోజులాగే నేను ఏడున్నరకు లేచాను. రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి పదకొండు అవటంవల్ల కళ్లు కాస్త మండుతున్నాయి. కిటికీలోంచి ఎండ మంచంమీద పడ్తోంది. కిటికిలోంచి ఎదురింటి వైపుకు చూసిన వాడినల్లా ఒక్కసారి ఆశ్చర్యపోయాను. ఆయింటి తలుపు తాళంవేసి వుంది. "బహుశా ఆ అమ్మాయి ఇల్లు ఖాళీచేసి వెళ్లి పోయి వుంటుందని" అనుకున్నాడు మనస్సులో. కాని ఆ అమ్మాయి తలుపు దగ్గర నుంచుని నన్ను చూస్తున్నట్లే అనిపిస్తోంది నాకు.

"నాకు కావలిసినంత కాలక్షేపం అన్నారు. తీరాచూస్తే ఆ అమ్మాయి నిన్న సాయంత్రం యిల్లు ఖాళీచేసేసింది" అప్పుడే కాఫీ తెచ్చిన శ్రీమతి నిష్ఠూరంగా అంది.

నేను మాట్లాడకుండా కాఫీ గ్లాసు అందుకున్నాను.

శ్రీమతి అక్కడి నుండి వెళ్లిపోయింద.

నేను మాత్రం ఆ యింటి వైపే చూస్తూ కూర్చున్నాను. "అవును ఆ అమ్మాయి మాత్రం నన్నుచూస్తూ ఎలా వుండగలదు. నాకు పెళ్లి కాలేదని అనుకుని ప్రేమలేఖలు రాసింది. తీరా అయ్యిందని తెలిశాక యిల్లు ఖాళీ చేసేసింది. ఏమైతేనేం తను చేసిన పొరపాటును తనంతట తాను తెలుసుకో గలిగింది. ఇకపైన జీవితంలో ఆ అమ్మాయి ఇటువంటి పొరపాట్లు చేయదు" నా మనసులో అనుకున్నాను.

కాఫీ కొద్ది కొద్దిగా తాగుతూ ఆ యింటి వైపే చూస్తున్న నాకు రెండు నెలల క్రితం నుంచి జరిగిన ఒక్కొక్క సంఘటన సినిమా రీలులా నా కళ్లముందు కదిలింది.